క్లుప్తంగా

నేటి నుంచి వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు


వారాహి అమ్మవారు

నాయుడుపేట టౌన్ : పట్టణంలో వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శని వారం నుంచి 15 తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చదలవాడ మోహన్ కృష్ణ స్వామి తెలిపారు. ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం వారాహి అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు చేశారు. మోహన్ స్వామి మాట్లాడుతూ ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాశీ గ్రామ దేవతగా పిలువబడే వారాహి అమ్మవారికి గుప్త నవరాత్రుల పేరిట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం వారాహి అమ్మవారితో పాటు శ్రీచక్ర యంత్ర మహా మేరువుకు పంచామృత అభిషేకాలు, సామూహిక అమ్మవారి మూల మంత్ర, లక్ష్మీ సహస్రనామ, కుంకుమ పూజలు చేస్తామన్నారు.

ఆదర్శ పాఠశాల పరిశీలన


వంట గదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

దొరవారిసత్రం : మావిళ్లపాడు గ్రామంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్ పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంటగదిని తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో క్లోరినేషన్ చేయించారు. అంటురోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, వైద్య సిబ్బంది జనార్ధనయ్య, కామేశ్వరి, విజయ్, జనార్ధన్ పాల్గొన్నారు.

నేడు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు


పెంపుడు కుక్కకు టీకాలు వేస్తున్న ఏడీ రమణయ్య

వాకాడు : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డి.రమణయ్య తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోటిక్ వ్యాధులుగా గుర్తించినట్లు తెలిపారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం మనుషులకు సుమారు 60 శాతం జూనోసిస్ వైరస్ వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. వాటి నుంచి కాపాడుకోవడానికి యాంటీ రేబిస్ టీకాలను అన్ని పశువైద్యశాలలో ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన కొన్ని జంతువులకు టీకాలు వేశారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఓజిలి: మండలంలోని అత్తివరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పాకనాటి రాజగోపాల్, టీడీపీ నాయకులు ఎల్లు గురుమూర్తి, వేలూరు అనీల్‌రెడ్డి విద్యా సామగ్రి కిట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు భువనేశ్వరి, శిరీష, గోళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.303 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి అమావాస్య ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి పురవిహారం చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొలిమేరల్లో రక్షగా కట్టిన వేపాకు తోరణాలు, చెన్నూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త





చాప కింద నీరులా డయేరియా

- ఇద్దరు వృద్ధురాళ్ల మృతి
- రక్షగా పొలిమేరల్లో వేపాకు తోరణాలు
- పారిశుధ్యం మెరుగు పడకపోవడమే కారణం

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరు పంచాయతీలో డయేరియా చాప కింద నీరులా విస్తరిస్తోంది. రోజుల తేడాతో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి చెందారు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టడంలో వైద్య, మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారు. దీంతో గ్రామస్తులు రక్షగా గ్రామ పొలిమేరల్లో వేపాకు తోరణాలు కట్టుకున్నారు. సంఘటన చోటు చేసుకుంది. చెన్నూరులో సుమారు 18 వేల మంది జనాభా ఉన్నారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది 15 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఒక ప్రాంతంలో చెత్త, కాలువల్లో మురుగు తొలగించేందుకు నెలకొకసారి మాత్రమే వీలవుతోంది. ఈ క్రమంలో పారిశుధ్యం మెరుగు పడక ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు.

15 రోజులుగా ప్రబలుతున్న డయేరియా

కలుషిత నీరు వల్ల చెన్నూరు సినిమా హాల్ ప్రాంతంలో డయేరియా ప్రబలుతోంది. గత 15 రోజుల క్రితం చెన్నూరులోని ఎస్టీ గురుకుల పాఠశాలలో 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై గూడూరు, నెల్లూరు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆ ప్రాంతంలో పర్యటించి విద్యార్థులను పరామర్శించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు తాగునీరు సరఫరా చేసే పైపులైన్లను తనిఖీ చేసి ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయేమో గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రెండు రోజుల క్రితం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు.

ఇద్దరు వృద్ధురాళ్ల మృతి

చెన్నూరులోని సినిమా హాల్ ప్రాంతంలో నివసించే పద్మమ్మ, వెంకటలక్ష్మమ్మ అనే ఇద్దరు వృద్ధురాళ్లు డయేరియాతో మృతి చెందారు. అలాగే పలువురు డయేరియా బారిన పడి గూడూరు, నెల్లూరులోని ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు ఆరోపిస్తున్నారు.

రక్షగా వేప మండలు

గ్రామంలో డయేరియా ప్రబలడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నిర్వహించిన జాతరలో ఏదైనా తప్పిదం జరగడం వల్ల ఇలా డయేరియా విజృంభిస్తోందని భావిస్తున్నారు. రక్షగా గ్రామ పొలిమేర్లతోపాటు వీధి మొదట వేప మండల తోరణాలు కట్టారు. అలాగే ఇతర ప్రాంతాల వారిని గ్రామంలోకి రాకుండా చూస్తున్నారు.


మురుగు కాలువ పక్కనే తాగునీటి కొళాయిలు

నా భర్త ఇబ్బంది పడుతున్నాడు



నా భర్తకు వారం రోజులుగా విరేచనాలతో బాధపడుతున్నాడు. గూడూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించాం. రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకుని వచ్చాను. ఇప్పుడు కూడా నీరసంగా ఉండడంతో పనులు చేసుకోలేకపోతున్నారు. తాగునీటి కలుషితం వల్లే డయేరియా సోకిందని వైద్యులు తెలిపారు.

– పద్మమ్మ, సినిమా హాల్ వీధి, చెన్నూరు

సిబ్బందిని పెంచాలి



చెన్నూరులో 18 వేల మంది జనాభా ఉన్నారు. అందుకు అనుగుణంగా పారిశుద్ధ్య పనులు చేయడానికి సిబ్బంది లేరు. 15 మందితో పారిశుద్ధ్యం సాధ్యమేనా? సిబ్బందిని పెంచి పనులు చేపట్టాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇటీవల ఇద్దరు వృద్ధురాళ్లు మృతిచెందినా చలించడం లేదు.

– గుర్రం రమణయ్య, సీపీఎం చెన్నూరు శాఖ కార్యదర్శి

తాగునీటి నమూనాలు సేకరిస్తున్నాం

గ్రామంలో తాగునీటిని డైరెక్ట్ పంపింగ్ చేస్తున్నారు. ఇటీవల గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అలాగే సినిమా హాల్ ప్రాంతంలో ఎక్కువగా డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని నీటి నమూనాలను సేకరించాం. ల్యాబ్‌కు పంపుతున్నాం. డయేరియా కట్టడికి తీవ్రంగా కృషి చేస్తున్నాం.

– జ్యోతి, వైద్యులు, చెన్నూరు పీహెచ్‌సీ

సింగనాలత్తూరులో నేను బడికి పోతా


ర్యాలీ చేస్తున్న ఎంఈవోలు, విద్యార్థులు


పెనుబర్తి గిరిజన పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

దొరవారిసత్రం : సింగనాలత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంఈవోలు మునిశేఖర్, కృష్ణయ్య నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుబర్తిలో

రాపూరు: మండలంలోని పెనుబర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ పెనుబర్తి గిరిజన కాలనీలో పర్యటించి బడిమానేసిన నలుగురు చిన్నారులను ఒకటో తరగతిలో, ముగ్గురిని మూడో తరగతిలో చేర్పించినట్లు తెలిపారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించి చదువు మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరిస్తామని పేర్కొన్నారు. సీఆర్‌పీ నరసింహులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏకొల్లులో డయేరియాపై అవగాహన

దొరవారిసత్రం : దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకొల్లు గ్రామంలో శుక్రవారం వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో డయేరియాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.

కాలనీల్లోని వీధుల్లో పర్యటించి నిల్వ ఉన్న నీటిలో క్లోరినేషన్ చేయించారు. ఉచ్చూరు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జోరతి, శ్రావణి, సుధాకర్, వెంకటరత్నం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏకొల్లు ఎస్సీ కాలనీలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చైతన్య

13న జగన్నాథ రథయాత్ర

గూడూరు రూరల్ : ఈ నెల 13వ తేదీన గూడూరు పట్టణంలో పదవ జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వాహకుడు డాక్టర్ సుఖదేవ్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరు పట్టణం సొసైటీ ప్రాంతంలో ఉన్న ఇస్కాన్ ప్రచార కేంద్రం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు ఇస్కార్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పూరీ జగన్నాథ రథయాత్రకు అనుగుణంగా గూడూరులో రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్థానిక భక్తులు సహకారం అందించాలని కోరారు.


మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

సైదాపురం: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రోగ్రామ్ అధికారి పీఎల్ దయాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు వైద్య సేవలు అందించే విధానాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న దయాకర్

దివ్యాంగులకు సాయం

గూడూరు రూరల్: స్థానిక కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, రెడ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రోహిణి

జీవో నంబరు 117ను రద్దు చేయాలి

నాయుడుపేట టౌన్ : జీవో నంబరు 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను కాపాడాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం బీటీఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి పేర్నాటి రామకృష్ణతో కలిసి ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల వద్ద సభ్యత్వ నమోదు చేపట్టారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీవోను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కలపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్డా వెంకటరావు, ఏ లక్ష్మీప్రసాద్, బొడ్డుబాబు, పాలేటి చంద్రయ్య, జీ పెంచలయ్య, జీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఏ సాగరం పాఠశాల వద్ద మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు నగదు బహుమతులు

సూళ్లూరుపేట : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మంగళంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సూళ్లూరుపేట పట్టణంలోని ఆచార్య భరధ్వాజ సేవా సంస్థ ప్రతినిధులు నగదు ప్రోత్సాహక బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. 569 మార్కులు సాధించిన లొక్కు అజయ్‌కు రూ.3,116, 568 మార్కులు సాధించిన చిట్టేటి జయంతికి రూ.2,116లు అందజేశారు. అలాగే 543, 522, 509, 508 మార్కులు సాధించిన అక్కుర్తి పవన్‌కుమార్, వేలూరు చందన, గుండుబోయిన లహరి, లొక్కు అశ్వనికి ఒక్కొక్కరికి రూ.1,116ల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య భరధ్వాజ సేవా సంస్థ నిర్వాహకులు మన్నెముద్దు చంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉద్దండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఆచార్య భరధ్వాజ సేవా సంస్థ ప్రతినిధులు

నేటి నుంచి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సమీపంలోని విన్నమాల జాతీయ రహదారి పక్కన ఉన్న కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శని, ఆదివారాలు ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల సత్సంగం నిర్వహిస్తున్నట్లు స్థానిక చాగంటి సేవా సంఘం నాయకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో అందుకుతగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి చాగంటి ప్రవచనాలు ఉంటాయని తెలిపారు.

చెంగాళమ్మ పరమేశ్వరి సేవలో చీరాల ఎమ్మెల్యే

సూళ్లూరుపేట : ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర్లు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తడ: తన భర్త మృతిపై అనుమానం ఉందని, విచారణ చేసి న్యాయం చేయాలని శ్రీకాళహస్తికి చెందిన పామల శ్యామల శుక్రవారం తడ పోలీసులను కోరింది. ఎస్‌ఐ నరసింహారావు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కోటచెరువు గ్రామానికి చెందిన పామల మధుబాబు(40) కుటుంబ వివాదాల కారణంగా రెండేళ్ల క్రితం తడ మండలం అక్కంపేట గ్రామానికి వచ్చి తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అక్కంపేటలోనే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. మధుబాబు అప్పుడప్పుడూ పెద్దగా కేకలు వేస్తుంటాడని, గురువారం రాత్రి కూడా కేకలు వేశాడని, తర్వాత సైలెంట్ అయ్యాడని స్థానికులు తెలిపారు. అక్కడికి వెళ్లి చూడగా అతను అపస్మారక స్థితిలో కిందపడి ఉండడంతో 108 ద్వారా సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వద్ద లభించిన ఆధారాల ఆధారంగా పోలీసులు మృతుని భార్యకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన మృతుని భార్య, కుటుంబ సభ్యులు మధుబాబు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సప్లయ్ చానల్‌ను పునరుద్ధరించాలని వినతి

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు చెరువుకు సాగునీటిని సరఫరా చేసే సప్లయ్ చానల్‌ను పునరుద్ధరించాలని పలువురు రైతులు కోరారు. వారు శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంయుక్త కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పెళ్లకూరు, చిల్లకూరు వడ్డిపాళెం గ్రామాల వద్ద ఉన్న సప్లయ్ చానల్‌ను పూడ్చి వేశారని తెలిపారు. దీంతో చెరువుకు నీరు రావడం లేదని పేర్కొన్నారు. కాలువను పునరుద్ధరించాలని కోరారు. స్పందించిన జేసీ పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. అలాగే చిల్లకూరు గ్రామానికి చెందిన వంకపూరి రమణమూర్తి మాట్లాడుతూ తన వ్యవసాయ భూమిని రోడ్డు కోసం తీసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదని వాపోయారు. కార్యక్రమంలో సర్పంచ్ కందమూడి శివకుమార్, రైతులు రమణయ్య, ప్రకాష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.


జేసీకి వినతి పత్రం అందజేస్తున్న జీలపాటూరు రైతులు

తప్పనిసరిగా డ్రైడేను పాటించాలి

సూళ్లూరుపేట రూరల్ : అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు దృష్టి రించాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. వారు శుక్రవారం సూళ్లూరుపేట మండలంలోని ఆబాక, సామంతమల్లాం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మంగళ, శుక్రవారం గ్రామాల్లో డ్రైడేను పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు కాలువల్లో దోమల వ్యాప్తి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, మోటార్లు తదితరల జాబితాను యాప్‌లో పొందుపరుస్తునట్లు తెలిపారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

'కాలం' మారింది

ఒకప్పుడు చేతికి గడియారం ఉండడం ప్రత్యేకత. అలాగే ఎక్కడికైనా వెళ్లాలంటే అలారం పెట్టుకుని నిద్ర లేచే వారు. ఇల్లు అందంగా ఉండేందుకు రకరకాల గోడ గడియారాలను ఏర్పాటు చేసుకునే వారు. కాలం మారింది. వాచ్‌లకు కాని కాలమొచ్చింది. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌ల రాకతో గడియారాలకు ఆదరణ తగ్గింది. సెల్ ఫోన్‌లో సమయంతోపాటు ప్రతి విషయమూ తెలుసుకునే వీలు ఉండడంతో గడియారాలను వినియోగించేవారి సంఖ్య బాగా తగ్గింది. తద్వారా గడియారాలను రిపేరు చేసే వారికి ఉపాధి కనుమరుగైంది.

- సెల్‌ఫోన్ రాకతో వాచ్‌ల కనుమరుగు
- స్మార్ట్ వాచ్‌లపై పెరిగిన మోజు
- వాచ్ మెకానిక్‌లకు దొరకని ఉపాధి

చిల్లకూరు: పిల్లలు చదువుకుంటున్నారంటే తల్లిదండ్రులు కష్టపడి చేతికి వాచ్ కొనిచ్చేవారు. అలాగే పాఠశాలకు, కళాశాలకు వెళ్లే సమయం తెలుసుకునేందుకు ఇంటిలో గోడ గడియారం (కీ ఇచ్చేవి, సెల్‌తో వాడుకునేవి) ఉంచే వారు. ఇంకా పరీక్షల సమయం వచ్చిందంటే చాలు పిల్లలను నిద్ర లేపేందుకు ఒక అలారం టైమ్ పీస్‌ను దగ్గర ఉంచే వారు. వాటిని రిపేరు చేసే మెకానిక్‌లు కూడా బజారులో ఎక్కువ మందే ఉండే వారు. ఎవరు త్వరగా రిపేరు చేసి ఇస్తారో వారి దగ్గరకు వచ్చి పని పూర్తి చేయించుకునేవారు. కొంతకాలం ఎలక్ట్రానిక్ వాల్ క్లాక్‌లు రాజ్యమేలాయి. ఇవి బ్యాటరీలు అయిపోతే వాటిని మార్చుకునే వారు. రిపేరు వస్తే మరో సారికి పనికి రావు కాబట్టి వాటి స్థానంలో కొత్తవి వాడుకునేందుకు సిద్ధం అయ్యేవారు. నేడు కొత్తగా మార్కెట్టులోకి స్మార్ట్ ఫోన్‌లు రావడంతో రిస్ట్ వాచ్‌లు, గోడ గడియారాలు, అలారం టైమ్ పీస్‌లు కనుమరుగు అవుతున్నాయి. దీంతో వాచ్‌లు రిపేరు చేసే వారికి జీవనోపాధి లేకుండా పోయి ఎక్కడో ఒక చోట మాత్రమే వారు కనిపిస్తున్నారు.


వాచ్ షాప్‌లో రిపేరు చేస్తున్న వాచ్ రాము

నేటి కాలంలో ..

చేతికి కట్టుకునే వాచ్‌లలో సమయం మాత్రమే చూసుకునే వీలు ఉంటుంది. స్మార్ట్ వాచ్‌లలో టైమ్ తోపాటు హార్ట్ బీట్, బీపీ, షుగర్ లెవల్స్ తెలుసుకోవచ్చు. అందువల్ల రిస్ట్ వాచ్‌లకు దూరం అవుతున్నారు. ఇలాంటి స్మార్ట్ వాచ్‌లు రిపేర్లు చేయడం కష్టం కాబట్టి వాచ్ మెకానిక్‌లు కనుమరుగవుతున్నారు.


స్మార్ట్ వాచ్

23 ఏళ్లుగా ఇదే పనిలో ఉన్నా

నేను చదువు పూర్తి చేసుకుని వాచ్ మెకానిజం నేర్చుకుని నేటికి 23 ఏళ్లు అవుతుంది. బజారులో వాచ్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నా. కొత్త వారికి పేరు చెప్పే సమయంలో వాచ్ రాము అంటేనే గుర్తు పడతారు. అలా వాచ్ మెకానిక్ పనికి దగ్గరైపోయాను. నేడు కొత్తగా స్మార్ట్ వాచ్‌లు రావడంతో వాచ్ మెకానిక్‌ల జీవనోపాధిపై దెబ్బపడింది. దీంతో ఎంతో మంది ఉపాధి లేక మరో పనిలోకి వెళుతున్నారు. నేను మాత్రం ఎక్కడ తక్కువ అద్దెకు రూం దొరకుతుందో ఆ ప్రాంతంలో షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా.

– రాము, వాచ్ మెకానిక్, గూడూరు